క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల బైక్‌ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తాండూర్: బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్‌కు స్వాగతం తెలిపేందుకు మండల అధ్యక్షుడు ఈసా ఆధ్వర్యంలో మండల నాయకులు శుక్రవారం బైక్ ర్యాలీ చేపట్టి పెద్దఎత్తున తరలివెళ్లారు. మండల కేంద్రంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మానవతా విలువల శిక్షణ శిబిరం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ సత్యసాయి దేవాలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక, మానవతా విలువల శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. భక్తులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాండూర్: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. తాండూర్ పంచాయతీ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇంకా చేపట్టాల్సిన పనుల గురించి కార్యదర్శి తపస్‌కుమార్‌కు సూచనలు చేశారు.

వృద్ధులకు ఇంటి నుంచే ఓటు



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

జన్నారం: 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, మంచంపై నుంచి లేవలేనివారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని బీఎల్వోలకు తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఫారం -12డీ 80 ఏళ్లు పైబడిన, వికలాంగుల ఓటర్ల వివరాలను అందజేశారు. ఫారం-12 డీ ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో వారికి తెలియజేశారు. సమావేశంలో డీటీ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల పందేల పోటీలు ప్రారంభం



ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్

భీమారం: దసరా సందర్భంగా మండలంలోని బూర్గుపల్లిలో శుక్రవారం ఎడ్ల పందేల పోటీలను చెన్నూర్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బుక్యా రాజ్‌కుమార్ ప్రారంభించారు. భీమారంతోపాటు నెన్నెల మండలాల రైతులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకుడు రమేశ్‌నాయక్, మండల కోఆప్షన్ మెంబర్ బాబర్‌ఖాన్ పాల్గొన్నారు.

'ఓసీపీలో బ్లాస్టింగ్‌లతో ఇబ్బందులు పడ్తున్నాం'

రామకృష్ణాపూర్: ఆర్‌కేపీ ఓపెన్‌కాస్ట్ గనిలో చేపడుతున్న బ్లాస్టింగ్‌ల వల్ల మట్టిపెళ్లలు ఎగిరి తమ ఇళ్లపై పడుతున్నాయని స్థానిక బీజోన్ ఆర్‌కే4 గడ్డ ప్రాంతవాసులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. బ్లాస్టింగ్‌ల వల్ల తమ ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లును కోరారు.

కట్టెల పొయ్యే దిక్కు

- ఊట్ల గ్రామంలో దుస్థితి
- పీఎంయూవైలో అందించిన గ్యాస్ సిలిండర్లు
- ఒక్కసారే వినియోగం.. ఆపై మూలకు
- గిరిజన గ్రామాల్లో అవగాహన లేకనే..

దండేపల్లి: గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ కుక్కర్లు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇంటింటా కట్టెల పొయ్యి వాడకాన్ని పూర్తిగా తగ్గించారు. గ్రామాల ప్రజలు గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా దీపం పథకం కింద రాయితీపై, పీఎంయూవై ద్వారా పూర్తి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందిస్తోంది. కానీ ఇప్పటికీ కొన్ని గిరిజన గ్రామాల్లో మాత్రం సిలిండర్లు వినియోగించడం లేదు. ఇప్పటికి కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు.

సిలిండర్లు తీసుకున్నప్పటికీ..

మండలంలోని ఊట్ల గిరిజన గ్రామంలో 80కి పైగా జనాభా, 22 కుటుంబాలు నివాసం ఉంటారు. వీరందరికీ కేంద్రం ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై)పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించింది. వీటిని తీసుకుని ఒకసారి వినియోగించుకున్నారు. గ్యాస్ అయిపోయాక, మళ్లీ రీఫిల్ చేయించుకోలేదు. దీంతో సిలిండర్లను మూలపెట్టారు. మళ్లీ ఎప్పటిలాగే, కట్టెల పొయ్యి వినియోగిస్తున్నారు. ఊట్లతోపాటు మరికొన్ని గిరిజన గ్రామాల్లో సిలిండర్లు కొందరు వినియోగిస్తుండగా, మరికొందరు మూలనపడేసినట్లు సమాచారం. సిలిండర్ల వినియోగంపై గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మహిళ

సిలిండర్ ఇయ్యలే..



మా గూడెంలో కొంత మందికి సిలిండర్లు ఇచ్చిండ్రు, కాని మాకు ఇయ్యలేదు. దీంతో మేము కట్టెల పొయ్యి మీదనే అండుకుంటున్నాం. జంగల్లనే ఉంటం కాబట్టి కట్టెలు బాగ దొరుకుతయి. కట్టెలకు ఇబ్బంది లేదు.

– మారినేని భూమక్క

ధర బాగా అయితంది



సిలిండరు ఇచ్చిండ్రు కాని గ్యాస్ అయిపోయింది. దాంట్లో గ్యాస్ నింపిద్దామనుకుంటే పైసలు బాగ అయితయి. అందుకని సిలిండర్‌ను పక్కకు పెట్టినం, కట్టెల పొయ్యిమీదనే వండుకుంటున్నాం. మాలాంటోళ్లకు తక్కువ ధరకు ఇత్తే గ్యాస్ నిపిత్తం. – ముడితే రజిత

అవగాహన కల్పిస్తున్నాం



సిలిండర్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. గిరిజనులకు పీఎంయూవై కింద ఉచితంగా సిలిండర్లు అందించాం. పీఎంయూవై సిలిండర్ కనెక్షన్ పొందిన వారికి రూ.300 సబ్సిడీ అందుతుంది. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండి, గ్యాస్ కనెక్షన్ లేనివారుంటే, ఇప్పటికైన దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఎలిగేటి సుధాకర్, ఇండేన్ గ్యాస్ మేనేజర్, దండేపల్లి

అలరించిన సాహితీ సమార్చన

చెన్నూర్: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మారెపల్లి వెంకటరమణ పట్వర్ధన్ స్వగృహంలో శుక్రవారం సాహితీ సమార్చన, కవిసమ్మేళనాన్ని ఆముదాల మురళి శతవధాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా శరన్నవరాత్రోత్సవాల్లో సాహితీ సమార్చన నిర్వహిస్తామన్నారు. సాహితీ సమార్చనకు జిల్లా నలుమూలల నుంచి కవులు, రచయితలు హాజరై కవితలను ఆలపించారు. అనంతరం కవులను సన్మానించారు. కవులు మారెపల్లి స్వరూపరాణి, చేపూరి నారాయణమూర్తి, జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, మేకల రామస్వామి, ఎం.కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆదివాసీలకు నిధులు కేటాయించాలి

నెన్నెల: వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆదివాసీ కొలవార్ మన్నేవార్‌లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆదివాసీ కొలవార్ ఉద్యోగ సంఘం జిల్లా నాయకుడు జంబి భీమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదిమ గిరిజనులు మన్నేవార్, కొలవార్ తెగ మొత్తం 9 గిరిజన జాతుల్లో ఒక్కటిగా ఉండి నేడు అంతరించిపోతుందన్నారు. ఇప్పటికి ఎన్నో ప్రభుత్వాలు ఆదివాసీ మన్నేవార్ తెగను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రాబోయే ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తూ తమ తెగను గుర్తించి న్యాయం చేయాలన్నారు. ఆదివాసీలకు ఉచిత విద్య, వైద్యంతోపాటు పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంబి భీమేష్

బతుకమ్మ వేడుకలు

మందమర్రిరూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తీసుకువచ్చి ఆడి పాడారు.



కాంగ్రెస్‌లో చేరికలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. గుడిపేట పంచాయతీ 9, 10 వార్డుల సభ్యులు ఆమద లక్ష్మి, జ్యోతి, గఢ్‌పూర్‌కు చెందిన నాయకులు రవి, శంకర్, కిరణ్, సతీశ్, బుద్ధిపల్లిలోని కొండాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సంక బన్నీ, అశోక్, రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అధ్యక్షుడు తోట రవి, నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్, శ్రీనివాస్‌గౌడ్, జితేందర్‌రావు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు బొప్పు సతీశ్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఆయనకు కండువా కప్పి పార్టీలో చేరారు.

మంచిర్యాలటౌన్: దండేపల్లి మండలం ద్వారక గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఉప సర్పంచ్ సిద్ధిప్రతాప్, యువనాయకులు సాయికృష్ణ, అంజి, శ్రీకాంత్‌తో పలువురు జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాను కప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రేమ్‌సాగర్‌రావు చేపడుతున్న సేవా కార్యక్రమాలతో పాటు, ఆయన ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.



పార్టీలో చేరిన దండేపల్లికి చెందిన బీఆర్‌ఎస్ ఉపసర్పంచ్, నాయకులతో ప్రేమ్‌సాగర్‌రావు

- మంచిర్యాలలోని 4వ వార్డు బీఆర్‌ఎస్‌కు చెందిన దుర్గం స్వామి, తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన పలువురి బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు ఆధ్వర్యంలో వేలాదిగా బైక్ ర్యాలీగా బెల్లంపల్లికి వెళ్లారు. కాంగ్రెస్ బెల్లంపల్లి అభ్యర్థి గడ్డం వినోద్ సమక్షంలో వారు పార్టీలో చేరగా, వారికి కండువా కప్పారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, ఉప సర్పంచ్‌లు పార్టీలో చేరారు.

ఆరు రోజుల్లో రెండు పార్టీలు!

- 14న బీఆర్‌ఎస్‌లో..
- శుక్రవారం కాంగ్రెస్‌కు వార్డు మెంబర్

దండేపల్లి: ఎన్నికల వేళ చిత్ర, విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. దండేపల్లి మండలంలో నాయకుల పార్టీల మార్పులు పరిపాటిగా మారాయి. మండలంలోని కాసిపేట వార్డు సభ్యుడు మల్లేశ్ ఈనెల 14న ఎమ్మెల్యే దివాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాడు. తాజాగా అదే వ్యక్తి శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీనిని బట్టి చూస్తే, ఎవరు ఏ పార్టీలో ఉంటున్నారో అర్థం కావడం లేదు.



శుక్రవారం ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరుతున్న మల్లేశ్

చెన్నూర్ టికెట్ కాంగ్రెస్‌కే కేటాయించాలి

చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ టికెట్ కాంగ్రెస్‌కే కేటాయించాలని మాజీ జెడ్పీటీసీ పోటు రాంరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికంగా చెన్నూర్, కోటపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ టికెట్‌ను కాంగ్రెస్ ఇవ్వాలని గురువారం పెద్దపల్లిలో జరిగిన రాహుల్ సభలో ప్లకార్డులు ప్రదర్శించామన్నారు. నిరసనను గమనించిన వేణుగోపాల్ మావద్దకు ఏఐసీసీ సభ్యులను పంపించారన్నారు. చెన్నూర్ టికెట్ సీపీఐకి ఇస్తే ఓడిపోతుందన్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి నియోకవర్గాలతోపాటు పెద్దపల్లిపై ఈ ప్రభావం ఉంటుందని వివరించామన్నారు. నాయకులు చెన్నూరి శ్రీధర్, కాంట్రాల మల్లయ్య, బొడ్డు రాకేశ్, ఆరె బాపు, పాతర్ల నాగరాజు, బన్సీ నాయక్, భీమ్ మధు, మోహన్‌రెడ్డి, అన్వర్, శ్రీనివాస్‌రెడ్డి, సుల్తాన్, సిరాజ్, ఎన్నం బాస్కర్, మహేశ్, నీలం మధు, అనిల్, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

భీమారం: చెన్నూర్ అసెంబ్లీ టికెట్ కాంగ్రెస్‌కే కేటాయించాలని మండల నాయకులు వెంకటేశ్, లాజర్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో బసచేసిన రాహుల్ గాంధీకి నియోజకవర్గ నాయకులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చెన్నూర్‌లో కాంగ్రెస్ హవా కొనసాగుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దండేపల్లి: మండలంలోని వందుర్‌గూడ గిరిజన గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముత్యంపేట బ్రాంచి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు లావాదేవీలు, పంట రుణాలు, పొదుపు పథకాలు, వివిధ రకాల రుణాలపై ప్రజలకు కళాజాత ప్రదర్శన ద్వారా కళాకారులు వివరించారు. బ్యాంకు మేనేజర్ అరుణ్ కుమార్, క్యాషియర్ ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.

'భూ ఆక్రమణను నివారించాలి'

తాండూర్: తాండూర్ శివారులోని సర్వే నంబర్ 630/1లో గల భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఎస్సీ కాలనీవాసులు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భూమిని గతంలో వేంకటేశ్వరావు తమకు దానం ఇచ్చారని, దాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే సర్వే చేపట్టి నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసాలు

రామకృష్ణాపూర్: సరస్వతి మూల నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మహిళల పూజల అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

తాండూర్: మండలంలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, స్వరూపరాణి, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల, ఆయా లక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కుంకుమ పూజల్లో మహిళలు

మంచిర్యాలఅర్బన్: శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్థానిక దుర్గామందిర్‌లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. రాళ్లపేట్ రోడ్ నెంబర్-1 దుర్గాదేవి వద్ద నిర్వహించిన కుంకుమపూజల్లో మహిళలు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై ప్రతిష్టించిన దుర్గాదేవికి మందమర్రి ఏరియా జీఎం మనోహర్ దంపతులు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. గని అధికారులు జీఎం దంపతులకు శాలువా కప్పి సత్కరించారు. బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) కెహెచ్‌ఎన్ గుప్తా, శాంతిఖని గని ప్రాజెక్టు అధికారి విజయప్రసాద్, గ్రూప్ ఇంజినీర్ బసవరాజు, మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, గని రక్షణ అధికారి రాజు, ఫిట్ ఇంజినీర్ రాంబాబు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలో దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు పూజలు, మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు.

జన్నారం: మండల కేంద్రంలోని దుర్గయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

చెన్నూర్: పట్టణంలోని బలిజవాడలో ఏర్పాటు చేసిన మంజునాథ దుర్గామాత మండపం వద్ద జరిగిన కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నెలకొల్పిన దుర్గామాత విగ్రహానికి మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సవిత దంపతులు సారె అందించారు. అమ్మవారి విగ్రహంతో నిర్వాహకులు పలు వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. అలాగే పట్టణంలోని విద్యానగర్‌లోని మండల నిర్వాహకులు అమ్మవారికి పుస్తె మట్టెలు అందించి ఊరేగింపు చేపట్టారు.

నెన్నెల: మండల కేంద్రంలోని సుంకరివాడలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కుంకుమార్చన పూజలు చేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: ప్రతి కార్యకర్త గడప గడపకూ వెళ్లి కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని చున్నంబట్టివాడ లయన్స్ భవన్‌లో శుక్రవారం పార్టీ పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మహారాష్ట్ర ఎమ్మెల్యే, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి అశోక్ ఉయికేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, జిల్లాలో కేంద్రం నిధులతో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలన సాగిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి మ్యాన మహేశ్, రజనీశ్ జూన్, పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్దన్, బొడ్డు రఘునందన్, బోయిని హరికృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

నస్పూర్: పట్టణంలోని సీసీసీ రాయల్‌గార్డెన్ సమీపంలో బీజేపీ కార్యాలయాన్ని మహారాష్ట్రలోని రాలేగావ్ ఎమ్మెల్యే, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి అశోక్ రాంజీ ఉయికె, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పట్టణ నాయకులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా అశోక్ రాంజీ ఉయికె మాట్లాడుతూ కేంద్ర పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అగల్ డ్యూటి రాజు, రంగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్‌జైన్, జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ ఆనందకృష్ణ, దళిత మోర్చా జిల్లా కార్యదర్శి మిట్టపల్లి మొగిళి, నాయకులు రమేశ్, పాషా, వెంకటేశ్, సుమన్, రాజు, మహేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథ్

ఉచిత వైద్యశిబిరం

జన్నారం: మండలంలోని ధర్మారం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వర బాధితులు పెరుగుతున్న దృష్ట్యా వైద్యశిబిరం నిర్వహించినట్లు వైద్యులు ఉమా శ్రీ, నారాయణ తెలిపారు. అనంతరం గ్రామంలో డ్రైడే నిర్వహించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలి

నస్పూర్: పట్టణ అభివృద్ధిలో భాగంగా కలెక్టరేట్‌తోపాటు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తమ భూములను త్యాగం చేశామని నస్పూర్‌కు చెందిన పలువురు ఎస్సీ రైతులు తెలిపారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నస్పూర్‌శివారు సర్వే నంబర్ 42లోని తమకు అసైన్డ్ చేసిన భూముల్లో ఇళ్ల నిర్మాణం చేపడితే అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. పర్మిషన్ లేదని అడ్డుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీ నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఉన్నతాధికారులపై స్వచ్ఛంద పౌర సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్‌రావు చేసిన ఆరోపణలు సరికాదన్నారు. సమావేశంలో రైతులు కొమురయ్య, భానయ్య, రాజం, పురుషోత్తం, రాజం, కిరణ్, రాజం, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్లలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్‌కు విజయాన్ని అందించాలని కోరారు. సర్పంచ్ మంచాల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుడుక సత్యం, కార్యదర్శి గజ్జెల్లి శేఖర్, రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీటీసీ రావుల వెంకటేశ్, స్థానిక నాయకుడు ఆసాది సుధాకర్, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం పనిచేయాలి



మాట్లాడుతున్న నగేశ్

మందమర్రిరూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ గెలుపు కోసం పనిచేయాలని ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ దుర్గం నగేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఒర్రెగడ్డ ఏరియాలో ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. అలాగే వైఎస్సార్‌టీపీలో పెద్దఎత్తున ఇతర పార్టీల నుంచి చేరడానికి సిద్ధంగా ఉన్నారని, త్వరలో చేరికల ప్రక్రియ ఉంటుందన్నారు. నాయకులు రాజేంద్రప్రసాద్, జావిద్‌ఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆలయాల నిర్మాణాలను అడ్డుకోవడం సరికాదు'

రామకృష్ణాపూర్: పట్టణంలోని మదీన మజీద్‌లో శుక్రవారం పట్టణానికి చెందిన ఆయా మతాల పెద్దలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానికంగా ఉన్నటువంటి చర్చీలు, మసీద్‌లు, ఆలయాల్లో చేపడుతున్న పలు నిర్మాణ పనులను అటు సింగరేణి సంస్థ, ప్రభుత్వం అడ్డుకోవడం ఏ మాత్రం సరికాదని పేర్కొన్నారు. సింగరేణి స్థలాల్లో నిర్మించుకున్న వారికి ఇళ్ల స్థలాలు ఇస్తున్న ప్రభుత్వం మరీ ఆలయాలు, మసీద్‌లు, చర్చీలకు ఎందుకు పట్టాలివ్వడం లేదని ప్రశ్నించారు. క్రైస్తవులకు సమాధుల కోసం కనీసం గ్రేవ్‌యార్డు లేకపోవడం బాధాకరమని, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అబ్దుల్‌అజీజ్, యాకూబ్‌అలీ, సలీం, పాషా, నాగరాజు, సాల్మన్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899